మేరు కులస్తులను బీసీ-ఏ లోకి మార్చండి

అబిడ్స్: మేరు కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరి, మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల అధ్యక్షుడు పొల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం మేరు కులస్తులను పట్టించుకునే పాపాన పోలేదన్నారు. దర్జీ పనులు చేసే మేరు కులస్తులకు కేసీఆర్ ప్రభుత్వం ఒక్క కుట్టు మెషీన్ కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 20 లక్షలకు పైగా ఉన్న మేరు కులస్తులకు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని


భట్టి విక్రమార్కను కలిసిన పోల్కం శ్రీనివాస్

విధాల సహకరించాలని ఆయన భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పదవులలో రాజ్యసభలో, పార్లమెంటు స్థానాలలో మేరు కులస్తులకు అవకాశం కల్పించాలని పోల్కం శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు.

సరోజినీనాయుడిని ఆదర్శంగా తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: భారత కోకిల సరోజినీనాయుడిని నేటి తరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ సునీతారాయి అన్నారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని సరోజినీనాయుడు వనిత మహావిద్యాలయ బాలికల కళాశాలలో భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలువురు మహిళకు వనిత పురస్కారాలను అందజేశారు. వనిత మహా విద్యాలయ కళాశాల అభివృద్ధి, మహిళల విద్యాభ్యున్నతికి చేసిన కృషికిగాను కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సులోచన మాథూర్


నివాళులర్పిస్తున్న ఆదిత్య మార్గం తదితరులు

ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆదిత్యమార్గం, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శోభన, అక్కేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీల అస్తిత్వ సమస్యలపైనే నా రచనలు'


ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: కులం, జెండర్ ఈ రెండు పడగల నీడ కింద నలిగిపోతూ స్త్రీలు తమ అస్తిత్వం కోసం పడే సంఘర్షణ తన రచనల్లో ఎక్కువగా కనిపిస్తుందని ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న ప్రఖ్యాత కవి రచయితల స్వీయ సాహిత్య జీవిత విశేషాల ప్రసంగ పరంపర 'నేను–నా రచనలు'కార్యక్రమంలో ఆమె మంగళవారం ప్రసంగించారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ నేటి కవులు, రచయితలు ముందుతరం సృజనకారుల రచనల్ని చదివి, వారి నుంచి స్ఫూర్తి పొంది ముందుకు సాగాలని సూచించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ శీలా సుభద్రాదేవి భర్త ప్రముఖ రచయిత, కవి శీలా వీర్రాజుతో పోటీ పడి రచనలు చేస్తూ సాహిత్య వ్యక్తిత్వాన్ని కాపాడుకున్నారని తెలిపారు. ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.సిల్మానాయక్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

వాలంటైన్స్ డేను అడ్డుకుంటాం

సుల్తాన్‌బజార్: వాలంటైన్స్ డేను వ్యతిరేకించాలని బజరంగ్‌దళ్ డిమాండ్ చేసింది. కల్తీ ప్రేమను ఒలకపోసే ప్రేమికులను అడ్డుకునే తీరుతామని హెచ్చరించారు. సోమవారం అబిడ్స్ జీపీఓ (జనరల్ పోస్ట్ ఆఫీస్) ఎదుట వాలంటైన్స్ డే గ్రీటింగ్స్‌ను బజరంగ్‌దళ్ కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ నేతలు రాహుల్, సుమంత్, ప్రవీణ్ మాట్లాడాతూ..స్వదేశీ సంప్రదాయ పరిరక్షణకు ఎంతకైనా పోరాడుతామన్నారు. ఓయో రూమ్‌లతో సహా పార్కులు, సినిమా


వాలంటైన్స్ గ్రీటింగ్స్‌ను దహనం చేస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

హాళ్లు, బేకరీలలో వాలంటైన్స్‌ను ప్రోత్సహిస్తూ ఈవెంట్స్ కండక్ట్ చేస్తే కచ్చితంగా అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు మహేష్‌యాదవ్, శంకర్, అభిలాష్, అఖిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపీకి ఆహ్వానం


దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న కృష్ణా నాయక్ తదితరులు

చాంద్రాయణగుట్ట: సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరుకావాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యను రవీంద్ర నాయక్‌నగర్ బంజార వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు కృష్ణా నాయక్ కోరారు. మంగళవారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈనెల 15న నాయక్ నగర్‌లో భోగ్ భండార్, అన్నదానం, ర్యాలీ ఉంటాయన్నారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు లచ్చిరాం నాయక్, రాం కుమార్, శ్రీను, చిన్న, ముఖేష్ తదితరులున్నారు.

'అంతరంగాలు' పద్య కావ్యం ఆవిష్కరణ

నాంపల్లి: మహారాష్ట్ర ప్రభుత్వ తెలుగు పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు గండూరి లక్ష్మీనారాయణ రచించిన 'అంతరంగాలు'పద్య కావ్యం పుస్తకావిష్కరణ సభ శుభం హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప అధ్యక్షతన జరిగిన సభకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. గౌరీ శంకర్ మాట్లాడుతూ..కవి గండూరి కఠినమైన ఛందోబద్ధమైన పద్య సాహిత్యాన్ని ఎన్నుకుని తమ మనోభావాలను, ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితుల గురించి నిక్కచ్చిగా వివరించారన్నారు. టీఎన్జీఓ నగర శాఖ అధ్యక్షులు గండూరి వెంకటేశ్వర్లు, ప్రముఖ చిత్రకారుడు గండూరి శ్రీనివాస్, పుస్తక పబ్లిషర్ మేనేజింగ్ డైరెక్టర్ గండూరి రమేష్, టీఎస్ఆర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధి బాబురావు, జియాలజిస్ట్ జవహర్, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సంగిశెట్టి లక్ష్మీ, ఓయూ పూర్వ లైబ్రేరియన్ రమేష్, వ్యాఖ్యాత డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

ఐఎస్‌సదన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య



సంతోష్‌నగర్: ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎస్.సైదయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎస్.మల్లేష్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో డీఐగా పని చేస్తున్న సైదయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు చర్యలు తీసుకుంటానన్నారు.

భార్యను చితకబాదిన వ్యక్తి అరెస్టు


విజయ్‌సింగ్

అబిడ్స్: భార్యను మద్యం మత్తులో చితకబాదిన ఓ వ్యక్తిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శివ మందిర్ ప్రాంతంలో నివసించే విజయ్‌సింగ్ భార్య పూజాసింగ్‌ను తాగిన మైకంలో చితకబాదాడు. ఆమె గర్భంలో ఉన్న శిశు మృతిచెందడంతో పోలీసులు విజయ్‌సింగ్‌పై కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేశారు. విజయ్‌సింగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. గర్భవతి అయిన భార్యను కనికరం లేకుండా తాగిన మత్తులో దాడిచేసి చితకబాదడంతోనే గర్భంలోని శిశువు మృతిచెందాడని తెలిపారు.

గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం బస్తీబాట

నాంపల్లి: గృహజ్యోతి కింద అర్హులను గుర్తించే ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఈ ప్రక్రియ టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు చేపడుతున్నారు. ఉచిత విద్యుత్‌ను వాడుకునేందుకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఇంటింటికీ తిరిగి వారి నుంచి ప్రజా పాలనలో చేసుకున్న దరఖాస్తు రశీదు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, మొబైల్ నంబర్ల జిరాక్స్ పత్రాలు సేకరించారు. ఏసీగార్డ్స్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నారాయణ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కరుణాకర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సమ్మయ్య, ఇతర సిబ్బందితో కలిసి షేర్‌గల్లీ, బజార్‌ఘాట్, దేవీభాగ్, రెడ్‌హిల్స్, జంగంబస్తీ,


ధ్రువీకరణ పత్రాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

పీఎస్‌నగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఇంటింటికి వెళ్లి గృహజ్యోతి పథకానికి సంబంధించి అర్హులను ఎంపిక చేసేందుకు వారి నుంచి జిరాక్స్ పత్రాలు తీసుకున్నారు.

అద్భుతమైన కళ ఫొటోగ్రఫీ

విజయనగర్‌కాలనీ: క్షణంలో అదృశ్యమయ్యే అద్భుత దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించి ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప కళ ఫొటోగ్రఫీ అని ప్రముఖ సినిమాటో గ్రాఫర్ పీజీ.విందా, సీఎఫ్ఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.గంగాధర్, ఫొటోగ్రఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఆర్.కమల్‌రాయ్ అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఫొటోగ్రఫీ 3వ సంవత్సరం విద్యార్థులు క్యాప్చర్డ్ కాంతి చిత్రాలు 2024 పేరిట ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ యూనివర్సిటీలో విద్యార్థుల ప్రతిభకు కొదవలేదని, వారు ఏర్పాటు


ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న పీజీ.విందా తదితరులు

చేసిన చిత్ర ప్రదర్శనలో కొలువుదీరిన అద్భుతమైన చిత్రాలు వారి సృజనాత్మకతను నైపుణ్యాన్ని చాటిచెబుతున్నాయన్నారు. ఫొటోగ్రఫీ విద్యార్థులకు సినిమా, టీవీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో విదేశాల్లో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు. ఈ ఫొటో ఎగ్జిబిషన్ ఈనెల 15న సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పోత్రియా వెంకి, రూఫుస్ గురుగుళ్ల, కీర్తన, జె.వెంకటేశ్వర్లు, ఎస్.కాంతారెడ్డి, నల్లి రవి, రాజ్‌కుమార్, ఎన్.హరీష్‌కుమార్‌తో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల్సుంపురా ఏసీపీగా మహ్మద్ మునావర్



అబిడ్స్: కుల్సుంపురా ఏసీపీగా మహ్మద్ మునావర్ నియమితులయ్యారు. కొన్ని నెలలుగా ఏసీపీగా పనిచేసిన మహ్మద్ జావేద్ ఇంటెలిజెన్స్‌కి బదిలీ కావడంతో హైదరాబాద్ మెట్రోరైల్‌లో పనిచేస్తున్న మహ్మద్ మునావర్‌ను కుల్సుంపురా ఏసీపీగా నియమిస్తూ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా ఆదేశాలు జారీ చేశారు. 1995 బ్యాచ్‌కు చెందిన మహ్మద్ మునావర్ సుల్తాన్‌బజార్, బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్లలో, సీసీఎస్‌లో ఎస్ఐగా, పహాడీషరీఫ్, గోల్కొండ పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్‌గా, బాలనగర్, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పనిచేశారు. 2018లో ఏసీపీగా పదోన్నతి పొంది హైదరాబాద్ మెట్రో రైల్‌లో విధులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు.

నేడు వసంత పంచమి వేడుకలు

గౌలిపురా: గౌలిపురాలోని జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్‌లో ఈనెల 14న వసంత పంచమి సందర్భంగా సరస్వతీ పూజ, అక్షరాభ్యాసం, నూతన అడ్మిషన్లు, భజన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రముఖ విద్యావేత్త, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్లవర్స్ డే, వెజిటేబుల్ డే, ఫ్రూట్స్ డేలను ఘనంగా నిర్వహిస్తారన్నారు. ముఖ్యఅతిథులుగా గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, బండ్లగూడ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ రామ్ మోహన్, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌తో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొంటారన్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

సంతోష్‌నగర్: భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు భవనంపై నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై బ్రహ్మచారి తెలిపిన వివరాల ప్రకారం..సంతోష్‌నగర్ కళందర్‌నగర్‌లో బిల్డర్ వాజిద్, మేస్త్రీ దిల్ హరణ్ భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. పనుల్లో ఛత్తీస్‌ఘడ్ ముంగేలి ప్రాంతానికి చెందిన గులాం బాదల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా ఈనెల 8న గులాం బాదల్ భవన నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో కిందపడిపోయాడు. ఈ ఘటనలో గులాం బాదల్ ఒక కాలు విరిగిపోయి..మెడకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గాయాలకు గురైన గులాం బాదల్‌ను తోటి కార్మికులు చికిత్స నిమిత్తం కంచన్‌బాగ్‌లోని ఒవైసీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బిల్డర్ వాజిద్, మేస్త్రీ దిల్ హరణ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


మాణిక్ రావు

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మొఘల్‌పురా బేలా అశోక్ పిల్లర్ ప్రాంతానికి చెందిన శాంతబాయి కుమారుడు జి.మాణిక్ రావు (33) కార్మికుడుగా పని చేస్తున్నాడు. మాణిక్ రావు పదేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. గత నెల 22న మాణిక్ రావు పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని శాంతబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన నాంపల్లి జనరల్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోరబండ–భరత్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ (60) బోరబండ–భరత్‌నగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతురాలి ఒంటిపై పసుపు, ఎరుపు రంగుల సిల్క్ చీర, లేత నీలం రంగు లంగా, నీలం రంగు చెప్పులు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించిన వెంకటేశన్

అఫ్జల్‌గంజ్: ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ జాతీయ సఫాయి ఖర్మాచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించారు. సోమవారం ఉదయం ఆసుపత్రికి చేరుకున్న ఆయనను ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, ఆర్ఎంఓలు, కార్మికులు (సఫాయి ఖర్మాచారి)లతో కలిసి ఆసుపత్రిలోని పలు వార్డులు, అత్యవసర విభాగంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. సఫాయి ఖర్మాచారుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, వారికి అం


చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ నాగేందర్

దిస్తున్న సేవల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓలు, వైద్య సిబ్బంది, సఫాయి ఖర్మాచారులు పాల్గొన్నారు.

యునానీ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తాం


సమస్యల పరిష్కరిస్తామని పత్రం అందజేస్తున్న ముజీబ్ ఉల్లా షరీఫ్

చార్మినార్: చార్మినార్‌లోని ప్రభుత్వ యునానీ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయింపచేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ చార్మినార్ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ తెలిపారు. మంగళవారం ఆయన తన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో కలిసి యునానీ ఆసుపత్రితో పాటు వైద్య కళాశాలను పరిశీలించారు. భవనం పైకప్పు శిథిలావస్థకు చేరుకోవడంతో మట్టి పెళ్లలు ఇన్‌పేషంట్ వార్డుల్లోని రోగులపై పడుతున్న వైనాన్ని వారు స్వయంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఎలాంటి మరమ్మతులకు నోచుకోకుండా ఉన్న యునానీ ఆసుపత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో రోగులు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు తాము యునానీ ఆసుపత్రిని సందర్శించి ఇక్కడి పరిస్థితులను తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూసా ఖాసీం,హైదర్ జాఫ్రీ, చందు, పురుషోత్తం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎరుకలకు ప్రాధాన్యం


ఎరుకల నాయకులతో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎరుకల కులస్తులకు తీరని అన్యాయం జరిగిందని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాలకు కృష్ణ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం పని చేసిన ఎరుకల నాయకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎరుకలను చిన్నచూపు చూశారని అందువల్లే గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎరుకల కులస్తులందరూ ముకుమ్మడిగా కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేశారని ఆయన అన్నారు. అంతేకాకుండా ఎరుకల కుల సంఘాలు, ఏకలవ్య సంఘాలు రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున వివిధ నియోజకవర్గాల్లో విజయం కోసం పని చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎన్నికల సమయంలో తాము కలిశామని ఎరుకల సంక్షేమానికి తాను కృషి చేస్తానని అప్పట్లో ఆయన మాకు హామీ ఇచ్చారని అన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి

ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ నాయకుడు కె.కృష్ణ అన్నారు. టోలిచౌకికి చెందిన సక్సెస్ స్కూల్ గత వారం తన వార్షికోత్సవ వేడుకలను ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించింది. ఆ వేడుకల్లో ఓ ఐదేళ్ల బాలుడు వేదిక సమీపంలోని నీటి సంపులో పడి మృతి చెందాడు. దీనిని ఖండిస్తూ మంగళవారం కాంగ్రెస్ నాయకులు కార్వాన్ బాంజావాడీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ..బాలుడి మృతికి ఇప్పటి వరకు పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించలేదని ఆయన ఆరోపించారు. పాఠశాలకు చెందిన కార్యక్రమాలు పాఠశాలల్లోనే జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. నాయకులు అబ్దుల్ హమీద్, చంటిబాబు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన


గోల్కొండ: డ్రైనేజీలు పొంగిపొర్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన హకీంపేట్‌లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హకీంపేట్‌లోని ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్లతో పాటు డ్రైనేజీలు వేయడానికి జరుగుతున్న తవ్వకాలను పరిశీలించారు. డ్రైనేజీలు పొంగిపొర్లి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడానికి తాను కొత్త డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు పంపుతున్నా


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

న్నారు. అందుకు అనుగుణంగా నిధులు మంజూరవుతున్నాయన్నారు. అయితే కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయడం లేదన్నారు. అలీముద్దీన్, సయ్యద్ జబ్బార్, మజీద్ తదితరులున్నారు.


నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ఉత్తమ సేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు. – అబిడ్స్

నేడు మీరాలంమండి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



చార్మినార్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా క్రిష్ణాజిల్లా గూడూరు మండలం కంకటావ గ్రామంలోని స్వయంబు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం తరఫున మీరాలంమండి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. బుధవారం తెల్లవారు జామున 5 గంటలకు అమ్మవారి అభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అనంతరం రుద్రాభిషేకం, విశేష అలంకరణ, అర్చన, నైవేద్యం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజలుంటాయన్నారు.

'విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు'



గోల్కొండ: విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని వీనస్ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన కాలిగ్రఫీ ఎగ్జిబిషన్ మంగళవారం ముగిసింది. ఈ కాలిగ్రఫీ ప్రదర్శనలో ఎన్నికైన వారికి మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అందమైన చేతిరాత ఆకట్టుకునే విధంగా ఉండాన్నే కాలిగ్రఫీ అంటారన్నారు. కాలిగ్రఫీ ఒక ప్రత్యేక కళ అని కాలిగ్రఫీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని ఆయన అన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. యాకుత్‌పురా పరిసర ప్రాంతాల్లోని నాలా అభివృద్ధి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అసద్ అన్వర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు


ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేనీ

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు, టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ వెంకట్రామ్‌పల్లికి చెందిన అనాథ బాలికలపై మీడియాలో కథనాలు రావడంతో సమాచారం తెలుసుకున్న ముజీబ్‌హుస్సేనీ అక్షర, కృషితకు రూ.10 వేల చొప్పున నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ..రానున్న రోజుల్లో వారిపై చదువులకు కూడా అసద్ అన్వర్ ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామన్నారు. తమ ట్రస్టు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ సేవలో ముందుంటామన్నారు.

ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి


ధర్నా చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

నాంపల్లి: సంక్షేమ వసతి గృహాల్లో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులు వైష్ణవి, భవ్య, దగ్గుబాటి వైష్ణవి ఘటనలపై విచారణ జరపాలని, ఆత్మహత్యలకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని సంక్షేమ భవన్ ఎదుట ధర్మ సమాజ్ పార్టీ, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి బరిగెల దుర్గా ప్రసాద్ మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై స్పందించని స్థానిక ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రతిపక్షం కూడా స్పందించకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా ఖండించారు. ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి. ఈ కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ మేడి కార్తీక్, రాష్ట్ర కో కన్వీనర్ సైదాబాబు, మేడ్చల్ జిల్లా కన్వీనర్ రాజ్‌కమాల్, సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ గోల్కొండ్ కృష్ణ, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం.సైదులు తదితరులు పాల్గొన్నారు.